

చక్రధరరావు స్టాఫ్ నందర్నీ పరిచయం చేసుకుని, అందరి పేర్లు అడిగి కరచాలనం చేసి, ఆ తర్వాతే తన రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు.

కొత్త బాస్ ఆ విధంగా సీటు సీటుకీ తిరిగి స్టాఫ్‌ని పరిచయం చేసుకుని వెళ్ళడం ఆఫీసు చరిత్రలో అదే మొదటిసారి.

"బాస్ బంగారంలాంటి వాడురా!" అన్నాడు సుబ్బారావు.

"మేడిపండు జూడ మేలి మైయుండు.. అన్నట్లు అప్పుడే పొగిడేయకండి. ముందు ముందు... చూద్దాం." మనిషి మంచితనం మీద నామ్మకం లేని సన్యాసిరాజు అన్నాడు.

"నీ మొహంలేరా! చూస్తే స్ట్రెయిట్

ఫార్వర్డ్‌లా వున్నాడు."

"ఇదే సమయంరా! సత్యమూర్తిగాడి వ్యవహారం బాస్‌తో మొరపెట్టుకుందాం. వాడినా సీట్లోంచి కదిలిస్తేగాని మన ప్రాణానికి సుఖం వుండదు." అన్నాడు తిరపతి.

"ఈరోజు ఆ వెధవ సెలవుపెట్టాడు పదండి పోదాం."

అంతా కదిలారు.

సత్యమూర్తి ఎవరో కాదు. ఆఫీసు స్టాఫ్‌లోవాడే. ఎస్టాబ్లిష్‌మెంట్ గుమస్తా. లంచం ముట్టందే ఏ పనీ ముట్టడు. టి.ఏ. బిల్లుకి "టెన్ పర్సెంట్" అంటాడు. అరియెర్స్ బిల్లు వేయాలంటే దక్షిణకాక మందు పార్టీ అదనం. ఎర్న్డ్ లీవు శాంక్షన్ కావాలంటేగూడా లంచం తప్పదు. ఇంక్రిమెంట్ సంగతి సరేసరి ఒక నెల ఇంక్రిమెంట్ డబ్బు సమర్పించుకోవాలి.

సత్యమూర్తి లంచగొండితనం లోగడ బాస్‌లతో చెప్పి ప్రయోజనం లేకుండా పోయింది. బాస్‌లుగూడా దొంగలే. పెద్దదొంగ చిన్న దొంగని ఏమనగలడు?

ఇన్నాళ్టికి సిన్సియర్ బాస్ వచ్చాడని సత్యమూర్తి సింహాసనం కదపడానికి నడుం కట్టారు.

* * *

"ఏమిటి విశేషం?" ప్రశ్నించాడు బాస్.

సత్యమూర్తి తమని ఎన్ని విధాల పీడిస్తున్నాడో బాస్‌కి మొరపెట్టుకున్నారు.

బాస్ తల వూపుతూ అప్పుడప్పుడూ వూ' కొడుతూ హిరణ్యకశిపుడు తమను పెడుతున్న బాధల్ని దేవతలు మొరపెట్టుకుంటుంటే వింటున్న శ్రీమన్నారాయణమూర్తిలా శ్రద్ధగా విన్నాడు.

"అతన్ని సీటునుంచి తొలగిస్తాను" అభయం ఇచ్చాడు.

అందరి ముఖాలు మెర్క్యురీ బల్బులు వెలిగినట్లు వెలిగిపోయాయి.

"థాంక్స్ సర్!"

"అయితే ఆ సీట్లో ఎవర్ని వేయాలి? మీరు సజెస్ట్ చెయ్యండి. ఆర్డర్స్ వేస్తాను." అన్నాడు బాస్.

లంచ్ టైమ్ అయింది.

ఆఫీసు లాన్స్‌లో కూర్చుని చర్చలు మొదలుపెట్టారు. ఆ సీటు ఆఫీసులో కీలకమైనది. అందరి జుట్లూ అతగాడి చేతిలో వుంటాయి. కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి నెత్తిన పెట్టుకోవాలి. లాన్స్‌లోనించి లేచి కాంటీన్లో కూర్చుని నాలుగు రౌండ్లు కాఫీలు త్రాగి అప్పటికి ఏకాభిప్రాయానికి వచ్చారు.

అతని పేరు భరత్‌కుమార్. పాతికేళ్ళ కుర్రాడు. అభ్యుదయ భావాలు వల్లెవేస్తుంటాడు. పైగా అతని తాత స్వతంత్ర సమరయోధుడు గూడా.

భరత్‌కుమార్ పేరు బాస్‌కి సజెస్ట్



చేశారు.

దాస్ ఆశ్చర్యపోయాడు.

“అతను కుర్రాడు. మీకన్నా జూనియర్. ఇంతమంది సీనియర్స్ వుండగా

అతన్నెందుకు సజెస్ట్ చేస్తున్నారు?" బాస్ ప్రశ్నించాడు.

"సార్! అతను కుర్రాడు జూనియర్ కాబట్టే సజెస్ట్ చేశాం. సీనియర్స్ లంచావతారాలు, అలవాటు పడినవాళ్ళయి వుంటారు కొత్తగా వచ్చిన జూనియర్స్ ఆదర్శంగా వుంటారు. లంచం అంటే వారికి అసహ్యం. సిన్సియర్‌గా పని చేస్తారు."

బాస్ తల ఆడించాడు నిజమే అన్నట్లు.

* * *

ఆర్నెల్ల తర్వాత...

స్టాఫ్ అంతా కట్టకట్టుకుని బాస్ రూమ్‌లోకి ప్రవేశించారు.

"ఏమిటి విశేషం?" ప్రశ్నించాడు బాస్.

"భరత్‌కుమార్‌ని ఆ సీట్లోంచి మార్చాలి సార్. ముక్త కంఠంతో ప్రార్థించారు.

బాస్ మతిపోయిన వాడిలా చూశాడు.

"అదేమిటి? మీరేగా అతన్ని కోరుకున్నారు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"అది మా బుద్ధితక్కువ. ఇప్పుడు చెంపలు వేసుకుంటున్నాం."

"ఏం జరిగింది?"

"చెప్పడాని కేముంది సార్? వీడికంటే ఆ సత్యమూర్తే నయం. అతను మాకు డబ్బు చేతికివచ్చాక లంచం తీసుకునే వాడు. వీడు ముందే రెట్టింపు ఇవ్వమని ప్రాణం తీస్తున్నాడు. రేట్లు పెరిగాయని ట్వంటీ పర్సెంట్ అంటున్నాడు చేతిలో నోట్లు పెట్టందే బిల్లు వెయ్యనని ఖచ్చితంగా చెప్తున్నాడు. తర్వాత మీరు ఇస్తారో. చస్తారోనని మొగమాటం లేకుండా మాట్లాడుతున్నాడు."

బాస్ చిరునవ్వు నవ్వాడు.

"అప్పుడు వాళ్ళ తాత దేశభక్తుడు... ఇదీ...అదీ అని పొగిడారు,"

"వీడు వాళ్ళ తాతనే తిడుతున్నాడు సార్! ఆయన దేశభక్తి వల్లనే ఆస్తిపాస్తులన్నీ కరిగిపోయాయట. తను పనికిమాలిన గుమాస్తాగా తయ్యారయ్యాడట..."

"సరే! మరొకర్ని సజెస్ట్ చెయ్యండి. మీలో సిన్సియర్‌గా పని చేసే వారెవరో?"

ఎవరూ మాట్లాడలేదు.

* * *

మర్నాడు భరత్‌కుమార్ స్థానంలో మళ్ళీ సత్యమూర్తి నియమించబడ్డాడు.

'గుడ్డిలో మెల్ల!'

గొణుక్కున్నారు స్టాఫ్.